అంతా 'కంప్యూటర్' మయం

- వేసవి సెలవులను వినియోగించుకుంటున్న విద్యార్థులు
- భవిష్యత్ ప్రణాళికతో కోర్సుల ఎంపిక
- సమ్మర్ ఆఫర్లతో ఆకట్టుకుంటున్న కోచింగ్ సెంటర్ నిర్వాహకులు



వైరాలోని కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు

వైరారూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని యువత సెలవుల్లో తమకు నచ్చిన కంప్యూటర్ కోర్సులు నేర్చుకునేందుకు వైరా పట్టణ కేంద్రంలోని పలు కంప్యూటర్ కోచింగ్ సెంటర్లకు వస్తున్న నేపథ్యాన నిర్వాహకులు సమ్మర్ ఆఫర్లు పెట్టి మరీ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు.

కంప్యూటర్‌పై ఆసక్తితో..

పాఠశాలలోని వివిధ తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. దీనికితోడు పది, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కూడా ముగిశాయి. దీంతో విద్యార్థులు సెలవులను వృథా చేయకుండా కొందరు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులకు వెళ్తుంటే.. మరికొందరు కంప్యూటర్ కోచింగ్ తీసుకునేందుకు వెళ్తున్నారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులే కాకుండా.. ఐదు తరగతిపై బడిన విద్యార్థులు సైతం కంప్యూటర్ శిక్షణపై ఆసక్తి కనబరుస్తున్నారు.

ఆకట్టుకుంటున్న ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు..

విద్యార్థులను ఆకట్టుకునేందుకు పలు ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు సమ్మర్ ఆఫర్లు ఇస్తున్నారు. గవర్నమెంట్ స్కీంల పరిధిలోని ఇన్‌స్టిట్యూట్‌లో పీజీడీసీఏ, ఎంఎస్ ఆఫీస్ తదితర కోర్సులు నేర్పేందుకు రూ.7,000 వరకు చెల్లించాల్సి వస్తుంది. అదే ప్రైవేట్‌లో అయితే 50శాతం ఫీజు రాయితీ సౌకర్యం కల్పించి అవే కోర్సులను రూ.3,500లకు నేర్పించడమే కాకుండా సెంట్రల్ గవర్నమెంట్ అనుమతి పొందిన సర్టిఫికేట్లు అందిస్తున్నారు.

- చిన్నారులకోసం కంప్యూటర్ బేసిక్‌లు రూ.1,500 రూ.2,000 ఫీజు తీసుకొని నెలన్నర వ్యవధి వరకు చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. 10–20 మంది చొప్పున బ్యాచ్‌లను విభజించి శిక్షణ ఇస్తున్నారు.

అందుబాటులో అనేక కోర్సులు..

కంప్యూటర్ శిక్షణలో విద్యార్థుల సౌలభ్యం కోసం నిర్వాహకులు బేసిక్ నుంచి డీసీఏ, పీజీడీసీఏ, ఎంఎస్ ఆఫీస్, తెలుగు, ఇంగ్లీష్ డీటీపీ, ఫొటో షాప్, పేజీమేకర్, ట్యాలీ, సీ లాంగ్వేజ్, హార్డ్‌వేర్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, జాబ్‌వర్క్‌తో పాటు పలు రకాల కోర్సులు ఉందుబాటులో ఉన్నాయి. అయితే ఇదివరకే కంప్యూటర్ నేర్చుకున్న కొందరు విద్యార్థులు పలు ఇంటర్నెట్ సెంటర్లలో, కాలేజీల్లో, ఆస్పత్రుల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు.

> ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం అందరికీ తప్పనిసరైంది. దీనిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో తమ పిల్లలకు కంప్యూటర్ పరిజ్ఞానం కోసం శిక్షణ ఇప్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు వేసవి సెలవులు వస్తున్నాయంటే చాలు, ఆట, పాటలపై ఆసక్తి చూపే విద్యార్థులు ఇప్పుడు ఏ కొంచెం సమయం దొరికినా కంప్యూటర్ ముందు వాలిపోతున్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం..



నేను ప్రస్తుతం వైరాలోని లైఫ్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్లో చేరాను. బేసిక్స్ నేర్చుకుంటున్నా. వేసవి సెలవులను వృథా చేయకుండా అన్ని కంప్యూటర్ కోర్సులు నేర్చుకొని దానిపై పట్టు సాధించడమే లక్ష్యం.

– రేపల్లి జస్విత, ఏన్కూరు

భవిష్యత్ ప్రణాళిక కోసం..



భవిష్యత్‌లో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పీజీడీసీఏ, డేటా ఎంట్రీ తదితర కోర్సులు నేర్చుకుంటున్నాను. భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాల కోసం కంప్యూటర్ కోర్సులు ప్రమాణికంగా మారాయి.

– పులి మనోజ్, అన్నారుగూడెం

క్లుప్తంగా

దళారులకు విక్రయించొద్దు..



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరారూరల్: రైతులు తమ పంటను దళారులకు విక్రయించి మొసపోవద్దని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సూచించారు. సోమవారం మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో సోమవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటనర్సిరెడ్డి, పుల్లయ్య, రామకృష్ణ, అశోక్, బాబు, చంద్రశేఖర్ రెడ్డి, మధు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏఈఓ రాజేష్ తదితరులున్నారు.

'పోషణ్ పక్వాడ'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ, అధికారులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సెక్టార్ స్థాయిలో సోమవారం సూపర్‌వైజర్ మహాలక్ష్మి ఆధ్వర్యాన నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ పాల్గొని గర్భిణులకు అవగాహన కల్పించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఐకేపీ ఏపీఎం రాజు, ఎంపీఓ కృష్ణ, పాల్గొన్నారు.

కొడవటిమెట్టలో క్షయ వ్యాధిపై..

తల్లాడ: మండలంలోని కొడవటిమెట్ట గ్రామంలో సోమవారం క్షయ వ్యాధిపై పినపాక ఆరోగ్య మందిర్ డాక్టర్ విజయచందర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 22మంది నుంచి క్లెనును సేకరించి.. ఖమ్మం సీబీ నాట్ పరీక్ష కేంద్రానికి పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ సురేష్, సంజీవ్, ఎఎన్‌ఎం అరుణిమ, అన్నపూర్ణ తదితరుల పాల్గొన్నారు.

అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటనను అడ్డుకోండి

వైరా: భారత వ్యవసాయ మార్కెట్‌ను కబళించే ప్రయత్నంలో భాగంగానే అమెరికా ఉపాధ్యక్షుడు ఇవాన్ పర్యటన సాగుతుందని ఆ పర్యటనను అడ్డుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, చింత నిప్పు చలపతిరావు, మేడా శరాబంధీ, తుమ్మల జాన్ పాపయ్య, కృష్ణమాచారి, పురుషోత్తం, మధు, రామకృష్ణ పాల్గొన్నారు.

108లో ప్రసవం, తల్లీబిడ్డ క్షేమం

తల్లాడ: గాలిదుమారం, వర్షంతో విద్యుత్ సరఫరా నిలిచిపోగా, గర్భిణికి పురిటినొప్పులు వస్తున్నాయనే సమాచారంతో తల్లాడ మండలం ముద్దునూరుకు ఆదివారం అర్ధరాత్రి 108 సిబ్బంది చేరుకున్నారు. ఈమేరకు గర్భిణి ఇనుపనూరి శిరీషను వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ నల్లగట్ల రామారావు, పైలట్ తాళ్లూరి, ఆశ వర్కర్ ఐ.రాములమ్మ చాకచక్యంగా వ్యవహరించి బిడ్డ మెడలో పేగులు వేసుకున్నప్పటికీ సాధారణ ప్రసవం చేశారు. శిరీష ఆడబిడ్డకు జన్మనివ్వగా ఇద్దరిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చారు.

ఆయుర్వేద వైద్యశిబిరం విజయవంతం



విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్ వెంకట్‌లాల్

మధిర: జిలుగుమాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధిర ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆయుర్వేద వైద్యాధికారి వెంకట్‌లాల్ శిబిరంలో పాల్గొని రక్తహీనత ఎదుగుదల లోపం ఉన్న బాలబాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది కందుల రాంబాబు, గణేష్ బాబు తదితరులు మాట్లాడుతూ.. యోగాలో మెలకువలు, ఎండ బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జవహర్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ సలీం పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాలలో..

ఏన్కూరు: ఏన్కూరులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి జి.శంకర్ బాలికలకు రక్తహీనత, దానిని తగ్గించడానికి తీసుకోవాల్సిన ఆహారం గురించి అవగాహన కల్పించారు. యోగా శిక్షకుడు చంద్రశేఖర్ ప్రాణాయామం, ధ్యానం చేయించారు. కార్యక్రమంలో ఆస్పత్రి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



వైరా ఏఎంసీలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వైరా/తల్లాడ/బోనకల్: ఇటీవల వచ్చిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, తల్లాడ మండల కార్యదర్శి నల్లమోతు మోహన్‌రావు తెలిపారు. సోమవారం వారు వైరా ఏఎంసీలో, తల్లాడలోని గోపాలపేటలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అదే విధంగా బోనకల్ మండలంలోని లక్ష్మీపురంలో నిర్వహించిన ఇంటింటికి రైతుసంఘం కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు పాల్గొని మాట్లాడారు. వరి, మిరప, మొక్కజొన్న, మామిడి పంటలను పరిశీలించి అధికారులు నష్టం అంచనా వేసి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చలపతిరావు, శరాబంధీ, జాన్ పాపయ్య, కృష్ణమాచారి, పురుషోత్తం, మధు, రామకృష్ణ, నరసింహారావు, సుధాకర్, రైతు సంఘం నాయకులు పాపయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, సత్యనారాయణ, నాగేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఉమ, మండల కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని రాఘవాపురం గ్రామంలో లబ్ధిదారులకు సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన మామిళ్లపల్లి రాజేష్, దొబ్బల సరస్వతి, సతీష్ లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.1.30 లక్షల విలువైన చెక్కులను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు భట్టికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపి, అప్పారావు, గ్రామపెద్దలు గోవిందరావు, శ్రీనివాసరావు, మహేష్, వీరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పనులు ప్రారంభం

కారేపల్లి: కారేపల్లిలోని ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 38లో బీసీ బాలుర హాస్టల్‌కు కేటాయించిన స్థలంలో సోమవారం పెన్సింగ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇటీవల బీసీ బాలుర వసతి గృహానికి కేటాయించిన స్థలం వివాదస్పదం కావటంతో.. జిల్లా కలెక్టర్ ఆ స్థలం హద్దుల వెంట ఫెన్సింగ్ ఏర్పాటుకై రూ.3లక్షల నిధులు జిల్లా పంచాయతీ రాజ్ శాఖకు కేటాయించారు. దీంతో పీఆర్ అధికారులు పనులు ప్రారంభించారు.

రేషన్ బియ్యం తరుగు లేకుండా ఇవ్వాలి

మధిర: రేషన్ డీలర్లకు ఎమ్ఎల్ఎస్ పాయింట్ వద్ద బియ్యం తరుగు లేకుండా కాంటా వేసి ఇవ్వాలని మండల రేషన్ డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు సుందర్‌రావు కోరారు. సోమవారం స్థానిక తహసీల్ వద్ద జరిగిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యం తరుగు రావడం వల్ల రేషన్ డీలర్లకు నష్టం జరుగుతుందన్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించాలని కోరారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

వైరా: వైరా కూరగాయల మార్కెట్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే అధిక దుకాణాలు కేటాయించడాన్ని నిరశిస్తూ సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలువురు దుకాణదారులు, బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2022లో అర్హులైన 47మంది వ్యాపారులకు దుకాణాలు కేటాయిస్తామని.. చెప్పి చేపట్టిన దుకాణ సముదాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుండా గాలికి వదిలేసిందన్నారు. తక్షణమే దుకాణ నిర్మాణాలను పూర్తిచేసి అర్హులందరికీ దుకాణాలు కేటాయించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చింతా వేణుకు వినతిపత్రం అందజేశారు.

'భూ భారతి'తో రైతు సమస్యలకు పరిష్కారం



నాగులవంచలో స్థానికులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

చింతకాని: రాష్ట్రంలో కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. చింతకాని మండలం నాగులవంచలో స్థానికులు, రైతులు పలు సమస్యలను సోమవారం ఆయనకు విన్నవించారు. ధరణి చట్టంతో తలెత్తిన సమస్యలతో ఇబ్బంది పడ్డామని వాపోయారు. దీంతో డిప్యూటీ సీఎం స్పందిస్తూ భూ భారతి చట్టంతో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే, బీటీ రోడ్ల నిర్మాణం, చింతకాని–ముదిగొండ మండలాలకు కలిపి వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు జగన్నాథపురంలో భూమిని పరిశీలించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మత్కేపల్లి క్రాస్ వద్ద పండ్లు అమ్ముతున్న మహిళలతో మాట్లాడి రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నారా అని ఆరా తీశారు.

ముదిగొండ: మండలంలోని వెంకటాపురంలో నూతన దంపతులు గుడిపూడి అఖిల్, రేవతిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆశీర్వదించారు. నూతన దంపతులు వారి కుటుంబ సభ్యులతో భట్టి మాట్లాడారు. ఈకార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు కన్నెబోయిన గోపి, మడుపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, ఆలస్యం బస్వయ్య, కంభం వీరభద్రం, ముత్తినేని వెంకటేశ్వర్లు, వెచ్చా మంగపతిరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు



సత్తుపల్లిరూరల్: అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ యోగేశ్వరరావు

ఎర్రుపాలెం/ముదిగొండ: ఈ నెల 23న ఎర్రుపాలెంలోని జమలాపురం వాసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో, ముదిగొండలోని నవతేజా ఫంక్షన్‌హాల్‌లో రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్లు ఎం.ఉషాశారద, సునీత ఎలిజిబెత్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కొత్త చట్టంపై వివరించనున్నందున రైతులు వినియోగించుకోవాలన్నారు.

ఈ నెల 28న ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో..

సత్తుపల్లిరూరల్: ఈనెల 28న సోమవారం ఎంఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ యోగేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా సోమవారం ఎంపీడీఓ, ఏఓ, ఎంపీఓ, ఏపీఎం, డిప్యూటీ తహసీల్దార్, గిర్దావర్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొనాలన్నారు.

'కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత లేదు'



కల్లూరు: మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ

కల్లూరు/సత్తుపల్లిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఎమ్మెల్సీ కవితకు లేదని ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి తెలిపారు. సోమవారం కల్లూరు ఏఎంసీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంతో పాటు సత్తుపల్లిలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని, బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఒరిగిందేమి లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్‌లో ఉండే పరిపాలన సాగించారన్నారు. లిక్కర్ స్కామ్‌లో జైలుకు వెళ్లిన కవిత ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ పద్మజారెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నారావు, కమల్‌పాషా, కుమారి, నర్సింరావు, గణేష్, మారేశ్వరరావు, కృష్ణ, సత్యంబాబు, శ్రీను, ప్రభాకర్‌రావు, నరసింహారావు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేమన శతక అవధాన పోటీల్లో ప్రతిభ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని విశ్వశాంతి పాఠశాలలో సత్తుపల్లిలో గార్లపాటి, బొల్లేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అష్టావధాన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆ పాఠశాలలో పది పూర్తిచేసుకున్న షేక్.హబ్రిదా, బిల్లా కృష్ణసాత్విక అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చారు. దీంతో వారిని ట్రస్ట్ నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదన్ రాజు బాల అవధానులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు ఇటువంటి ప్రక్రియలు నేర్చుకుని ప్రదర్శన ఇవ్వడం అభినందనీయమని, ఇటువంటి విద్యార్థులను తమ సంస్థ ఎప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ, రమణమూర్తి, కిషోర్‌కుమార్‌రెడ్డి, శైలజ, దుర్గమణి తదితరులు పాల్గొన్నారు.

వైరాలో కార్గో సేవలు

వైరా: ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలని మధిర ఆర్టీసీ డిపో మేనేజర్ శంకరరావు తెలిపారు. సోమవారం వైరా బస్టాండ్‌లో కార్గో సేవలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీహెచ్ నాగేశ్వరరావు(ఏజెంట్, 81065 01302) ద్వారా కార్గో సేవలు అందుతాయన్నారు. కార్గో ఆపరేషన్స్ టీమ్ లీడర్ మునీర్ పాషా, మధిర డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉపేందర్, వైరా స్టేషన్ మేనేజర్, కంట్రోలర్ తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో కంటైనర్ కిందకు ద్విచక్రవాహనం దూసుకెళ్లగా, తృటిలో ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కంటైనర్ రింగ్ సెంటర్ వద్ద సోమవారం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ కంటైనర్ కిందకు దూసుకెళ్లినా డ్రైవర్ అప్రమత్తతతో వాహనదారులు సురక్షితంగా బయటపడ్డారు.

గౌడ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవం



కమలాపురం గౌడ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులతో ఎన్నికల అధికారి స్వప్న

ముదిగొండ: మండలంలోని కమలాపురం గౌడ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుడిగా మరికంటి కృష్ణగౌడ్, కాసాని నరసింహారావు లతో పాటుగా.. సంఘం కార్యదర్శిగా కందిమళ్ల కొండయ్య, డైరెక్టర్‌గా మరికంటి రామయ్యలను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఏకగ్రీవంగా ఎన్నికైన వారికి ఎన్నికల అధికారి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఈ.స్వప్న నియామక పత్రాలను అందించారు.

సంక్షిప్త సమాచారం

- **ఉద్యోగ విరమణ సహజం**

కారేపల్లి: ఉద్యోగంలో పదవీ విరమణలు సహజమని ఎంఈఓ జయరాజు అన్నారు. సోమవారం కారేపల్లి మండలం రావోజీతండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ.. పదవీ విరమణ పొందనున్న ఊడుగు సుధాకర్ రావు – అనిత దంపతులకు పేరుపల్లి స్కూల్ కాంప్లెక్స్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. అనంతరం పేరుపల్లి స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు శ్యామ్‌లాల్ స్వయంగా రచించిన ప్రశంసా పత్రాన్ని చదివి వినిపించి, మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, రామకృష్ణ, వేణుగోపాల్, శ్యామ్‌లాల్, వీరూనాయక్, శంకర్, బన్సిలాల్, రవి, అన్నపూర్ణ, రాంబాయి, అరుణ పాల్గొన్నారు.

- **ఘనంగా ఫేర్‌వెల్ డే**

మధిర: ఖమ్మంపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఆర్‌వీ సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని విజ్ఞప్తి చేశారు. 7వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించి మెరిట్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

- **గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి**



మాట్లాడుతున్న ప్రసాద్

కొణిజర్ల: కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, కర్షక వర్గాల వ్యతిరేక విధానాలపై మే 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని పల్లిపాడులో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, కృష్ణ, జానకిరాములు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రాధాకృష్ణ, కేవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **ఎస్ఎఫ్ఐ మహాసభలను..**

చింతకాని: ఈ నెల 25, 26, 27వ తేదీల్లో ఖమ్మం నగరంలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి గద్దం విజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సోమవారం ఎస్ఎఫ్ఐ మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలు పరిష్కరించుటలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల మాజీ కార్యదర్శి దేశబోయిన ఉపేందర్, నాయకులు సమద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

- **వృద్ధులకు అన్నదానం**

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చింతనిప్పు శంకరయ్య వర్ధంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. చింతలపూడి వెంకటేశ్వరరావు, పెనుగొండ ఉపేందర్‌రావు, అబ్బూరి రమేష్, మరికంటి రాంగోపాల్ తదితరులున్నారు.

- **అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువులు..**

తల్లాడ: మండలంలోని నారాయణపురం అంగన్‌వాడీ కేంద్రానికి సోమవారం ఏనుగు రాఘవయ్య జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి వైరా ఆధ్వర్యంలో వస్తువులు అందించారు. ఈ సందర్భంగా రూ.10 వేల విలువైన బేబీ చైర్స్, ఫ్యాన్లు, వాటర్ క్యాన్, ర్యాక్, టేబుల్ వంటి వస్తువులను అందించారు. అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన విద్యుత్ తల్లాడ పంచాయతీ ద్వారా ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ సురేష్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు సుమన్‌బాబు, మాలతీ దాస్, శివ, పంచాయతీ ఈఓ కృష్ణారావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

- **ఫ్రీజర్ బాక్స్ వితరణ**



ఫ్రీజర్ బాక్స్ అందిస్తున్న దాతలు, మట్టా దయానంద్

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో సోమవారం పగడాల దర్గమ్మ దశదిన కర్మ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఫ్రీజర్ బాక్స్ వితరణగా అందించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ చేతుల మీదుగా అన్నారుగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు ఫ్రీజర్ అందజేశారు. అనంతరం లక్ష్మీనగర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అయినాల వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తల్లాడ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాపా సుధాకర్, నాయకులు రఘుపతిరెడ్డి, నరసింహారావు, రమేష్, కృష్ణయ్య, శ్రీనివాసరావు, రాము, జోసఫ్, కిరణ్ పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

జలవనరుల శాఖ కార్యాలయం .. నిరుపయోగం



తల్లాడలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంటుంది. దశాబ్ద కాలం క్రితం తల్లాడలో నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో నూతన భవనం నిర్మించారు. ఈ భవనం ద్వారా ఐబీ శాఖ ఆధ్వర్యంలో కొన్నేళ్లు విధులు నిర్వహించారు. ఐబీ, ఎన్నెస్పీ మిళితమవ్వడంతో జల వనరుల శాఖగా ఏర్పడింది. దీంతో అప్పటి నుంచి ఇక్కడ ఏ శాఖ ఈ భవనాన్ని ఉపయోగించుకోవటంలేదు. అప్పటి నుంచి ఈ భవనం నిరుపయోగంగానే ఉండడంతో దాని ముందు చెత్త చెదారం పేరుకుపోయింది. ఇకనైనా జలవనరుల శాఖ, పోలీస్ శాఖ అధికారులు స్పందించి భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరారు.

– తల్లాడ

ప్రశ్నించాల్సిన అధికారి : శ్రీనివాసరావు, జలవనరుల శాఖ డీఈ, తల్లాడ సబ్ డివిజన్
సెల్ నంబర్ : 9440802868